క్లుప్తంగా

స్థలం కేటాయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న యువకులు

దహెగాం: మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నందున బస్‌షెల్టర్ నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని కేటాయించాలని యువకులు శుక్రవారం తహసీల్దార్ కవితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు చెట్లకింద, దుకాణ సముదాయాల వద్ద వేచి చూడాల్సి పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సిద్దు గౌడ్, విఘ్నేష్, ప్రదీప్, సత్యగౌడ్, రాకేశ్, సృజన్, సుమీత్ పాల్గొన్నారు.

'బాల్యవివాహాలు చేసుకోవద్దు'



మాట్లాడుతున్న పోలీసులు

కెరమెరి: బాల్య వివాహాలు చేసుకోవద్దని మహిళ పోలీసులు లక్ష్మి, హారిక, రేశ్మా అన్నారు. శుక్రవారం మండలంలోని మోదీ గిరిజన సంక్షేమ ఉన్నత బాలికల పాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వెంటనే 100కు ఫోన్ చేయాలన్నారు. ఖాతా నెంబర్లు, ఓటీపీలు ఎవ్వరికీ చెప్పవద్దని, మోసగాళ్ల వలలో చిక్కుకోవద్దన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు.

ఉద్యమకారుల ఫోరం మండల కన్వీనర్‌గా వినోద్ జైస్వాల్



నియామకపత్రం అందచేస్తున్న దుర్గం రవీందర్

రెబ్బెన: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కన్వీనర్‌గా మండల కేంద్రానికి చెందిన వినోద్ జైస్వాల్ నియమితులయ్యారు. శుక్రవారం ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ దుర్గం రవీందర్, నియోజక వర్గ కన్వీనర్ అజ్మీరా బాబురావులు నియమకపత్రాన్ని అందచేశారు. ఉద్యమకారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి కోరామన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు తోట లక్ష్మణ్, శ్రీధర్, నర్సయ్య, దయాకర్ పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో కార్మికుల కోసం సురక్షితమైన రోడ్డు సౌకర్యం కల్పించాలని హెచ్‌ఎంఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు కోరారు. శుక్రవారం సీహెచ్‌పీ ఎస్‌ఈ కోటయ్యకు వినతిపత్రం అందచేశారు. సీహెచ్‌పీలో పని చేస్తున్న కార్మికులు డ్యూటీకి వచ్చేందుకు రోడ్డు సరిగా లేకపోవటంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏఐటీయూసీ నాయకులు కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి ఆరీఫ్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి ఉమామహేశ్వర్, దత్తు పాల్గొన్నారు.

జాతర ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల ప్రసిద్ధ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 11 నుంచి 13 వరకు నిర్వహించే జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు అందచేశారు. జాతర మహోత్సవానికి హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జయరాం, కాంగ్రెస్ నాయకులు గంటుమేర, సుదర్శన్‌గౌడ్, గుంపుల విమలేష్, రాజేశ్, చిరంజీవిగౌడ్, పేరం శ్రీనివాస్, ప్రకాష్‌రావు, దుప్పానాయక్ పాల్గొన్నారు.

మూడేళ్లుగా నిరీక్షణ..!

- రవాణా భత్యం..అందని దైన్యం
- విడుదల చేయని ప్రభుత్వం
- విద్యార్థుల ఎదురుచూపు
- రాకపోకలకు తప్పని తిప్పలు



బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

కెరమెరి: ఉన్న గ్రామంలోనే చదువుకొనే అవకాశం లేక, ఇతర ప్రాంతాల్లో బడికి వెళ్తున్న విద్యార్థులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు రవాణా భత్యం ఇస్తున్నామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు రవాణా భత్యం అందక పేద మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడుతోంది. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 98 ఉండగా.. అందులో 56 (లోకల్‌బాడి) ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 3242 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో కెరమెరి, గోయగాం, ఝరి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు, మరిన్ని ప్రాథమికోన్నత పాఠశాల్లో విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేస్తున్న వారు గతేడాది 116 మంది ఉండగా.. ఈసంవత్సరం 66 మంది ఉన్నారు. వీరందరికీ రవాణా భత్యం రావాల్సి ఉంది. గతంలోనే విద్యార్థులకు సంబంధించి బ్యాంకు ఖాతాలు తెరిచి ఖాతాల వివరాలు ఉన్నతాధికారులకు సమర్పించారు.

దూరాన్ని బట్టి రవాణా భత్యం..

విద్యార్థులు చదువుకునేందుకు వెళ్లే దూరాన్ని బట్టి రవాణా భత్యం అందిస్తారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు (1–5వ తరగతుల వరకు) కిలో మీటరు దూరం వెళ్లే వారికి నెలకు రూ.400 చొప్పున, 3కిలో మీటర్ల దూరం నుంచి పాఠశాలలకు వస్తున్న 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ. 600 చొప్పున 10 నెలలకు సంబంధించి భత్యం ఇస్తారు. బస్సు సౌకర్యం లేక మూడు, నాలుగు కిలో మీటర్ల నుంచి కాలినడకన సైకిళ్లపై ఆటోల్లో వస్తున్నారు. చాలా చోట్ల బస్సులు సమయానికి రాక ఇబ్బంది పడుతున్నారు. ఆర్థికంగా కొంత బలపడిన తల్లిదండ్రులు తమ పిల్లలకు సైకిళ్లు కొనిస్తుంటే.. పేదవాళ్లు మాత్రం రోజు ఆర్టీసీ బస్సుకు చార్జీలు పెట్టి పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా రవాణా భత్యం మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నివేదిక సమర్పించాం



గతంలోనే అర్హులైన దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థుల వివరాలను సేకరించాం. బ్యాంకుల్లో ఖాతాలు కూడా తెరిపించాం. వివరాలన్ని ప్రభుత్వానికి సమర్పించాం. త్వరలో నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది. నిధులు మంజూరైతే విద్యార్థులు ఇచ్చిన ఖాతాల్లో రవాణా భత్యం జమచేస్తాం.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

మెరుగైన ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యనందించడంతో పాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎంలు నారాయణ్‌సింగ్, నానాజీ, సీఆర్పీలు ప్రకాశ్, లాలాజీ, సుమన్, లూలాజీ, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై కాశీయాత్ర



రామకృష్ణకు స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: లోక కల్యాణార్థం సైకిల్‌పై కాశీ యాత్ర చేపట్టిన వక్కలగడ్డ రామకృష్ణ శుక్రవారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈనెల 3న విజయవాడ నుంచి బయలుదేరి 18 రోజుల్లో కాశీకి చేరనున్నట్లు వివరించారు. గతంలోనూ రామకృష్ణ సైకిల్‌పై 15సార్లు శబరిమాల యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకన్న, ప్రమోద్, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

షీటీం సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

దహెగాం: మండలంలోని ఇట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కాగజ్‌నగర్ డివిజన్ షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం సభ్యులు రమాదేవి, సునీతలు మాట్లాడుతూ.. హింస, ఈవ్ టీజింగ్, సైబర్‌క్రైంకు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలన్నారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడవద్దన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. అత్యవసర సమయంలో 100కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ జాబితా నుంచి ముస్లింలను తొలగించాలి



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన తప్పుల తడకగా ఉందని బీసీల జాబితా నుంచి ముస్లింలను తొలగించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేసి బీసీలకు 42 శాతం వాటా ఇవ్వాలన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలన్నారు. బీసీల జనాభా 21 లక్షలు తగ్గించి ఓబీసీ జాబితా పెంచి ముస్లింలను బీసీలలో కలిపి వారిని ముస్లిం బీసీగా చేర్చడం హిందువులను, బీసీలను సమాధి చేయడమేనన్నారు. రానున్న ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, మండల ప్రధాన కార్యదర్శి ఓదెలు, ప్రసాద్, రాజేష్, నగేశ్ పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి

- నివాళులర్పించిన ఆయా సంఘాల నాయకులు



కౌటాల: నివాళులర్పిస్తున్న నాయకులు

కౌటాల: మండల కేంద్రంలోని బుద్ధ విహార్‌లో శుక్రవారం రమాబాయి అంబేడ్కర్ జయంతి మహార్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, నాయకులు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళితుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. రమాబాయి, అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక ఆరె సంక్షేమ సంఘం భవనంలో నివాళులర్పించారు. నాయకులు జానకీరావ్, ఆత్మారాం, కిశోర్, ఏమాజీ, ప్రకాశ్, పత్రు, విఠల్, అవినాశ్ పాల్గొన్నారు.

కెరమెరి: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సతీమణి రమాబాయి 127వ జయంతిని మండల కేంద్రంలో శుక్రవారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రమాబాయితో పాటు అంబేడ్కర్, గౌతమ బుద్ధుడి విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిలంచారు. కార్యక్రమంలో సింగల్‌విండో వైస్ చైర్మన్ కంబాల లక్ష్మి, గోగ్ల రాజయ్య, రాథోడ్ అంబాజీ, పెందోర్ శ్రీనివాస్, కంబాల వినేష్ పాల్గొన్నారు.

దహెగాం: మండల కేంద్రంలో రమాబాయి జయంతిని అంబేడ్కర్, బౌద్ధ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బౌద్ధ సంఘం మండల అధ్యక్షుడు కుమ్మరి రాజయ్య, రాజ్యాంగ అవగాహన వేదిక ఉపాధ్యక్షుడు రాజారాంల ఆధ్వర్యంలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమాబాయి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు శంకర్, శ్రీనివాస్, తోగం అశోక్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



కెరమెరి: నివాళులర్పిస్తున్న నేతలు



దహెగాంలో..

చిరుధాన్యాలు సాగు చేయాలి



పంటను పరిశీలిస్తున్న సభ్యులు, రైతులు

కౌటాల: రైతులు చిరుధాన్యాలను సాగు చేయాలని ఐఐఆర్ఆర్ రిటైర్డ్ శాస్త్రవేత ఎల్‌వీ సుబ్బరావు అన్నారు. విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం కౌటాల రైతు వేదిక భవనంలో కౌటాల, ఆసిఫాబాద్, కెరమెరి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. దేశంలో చాలా మంది పౌష్టికాహార లోపంతో బాధ పడుతున్నారని, చిరుధాన్యాల సాగుతో పౌష్టికాహారం అందుతుందన్నారు. రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలన్నారు. సేంద్రియ ఎరువులు వినియోగిస్తే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. అనంతరం మండలంలోని బోదంపల్లి, గురుడుపేట గ్రామాల్లో జొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో ప్రేమలత, ఏఈవోలు రేష్మిత, అంజన్న, ఘన్‌శ్యాం, సిదార్థ, వాసు, పద్మాకర్, సురేందర్, పితాంబర్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు అందజేస్తున్న నాయకులు

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీజేపీ మండల మహిళ నాయకులు నైతం సీతల్ అన్నారు. వీర్దండి గ్రామంలో కొనసాగుతున్న కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. గెలుపొందిన ఆదిలాబాద్ జట్టుకు రూ. 30వేలు, రన్నరప్‌గా నిలిచిన వీర్దండి జట్టుకు రూ. 20 వేలు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత అన్నిరంగాల్లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బండు, సాయినాథ్, సుధాకర్, నానాజీ, మనోహర్, కుశబ్‌రావు, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతులో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ ఉర్మిల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఆసిఫాబాద్ పట్టణంతో పాటు మండలంలోని బూర్గుడ ఉప కేంద్రం పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బెల్లం, పటిక స్వాధీనం



పట్టుకున్న బెల్లం, పటికతో అధికారులు

చింతలమానెపల్లి: మండలంలోని లంబాడిహేటి గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న బెల్లం, పటికను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి లంబాడిహేటి సమీపంలో తనిఖీలు చేయగా.. ఆటో ట్రాలీలో నాటుసారా తయారీకి సరఫరా చేస్తున్న 630 కిలోల బెల్లం, 10కిలోల పటిక, 20లీటర్ల నాటుసారా, ఆటో ట్రాలీని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లంబాడిహేటి గ్రామానికి చెందిన అజ్మీర కరుణ, కాగజ్‌నగర్ మండలం ఈస్‌గాంకు చెందిన సాయి రమేశ్, బుడె వేణులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీలో ఎస్సైలు పి.లోభానంద్, సురేశ్, పి.రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

బెజ్జూర్: మండలంలోని సిద్ధాపూర్ గ్రామానికి చెందిన గుర్లే రాములుకు నరాల చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీ లెటర్‌ను సిర్పూర్ ఎమ్మెల్యే పీపీ అందజేశారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం మంజూరైన లెటర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో అందించారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జైనూర్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మండలంలోని పట్నాపూర్, జైనూర్, పానపటార్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. పానపటార్ ఆశ్రమ పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పరిశీలించి, పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

16న టాలెంట్ టెస్ట్

కెరమెరి: ఈనెల 16న జిల్లాలోని అన్ని మండలాల్లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టులు నిర్వహించనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కెరమెరి ఎస్సై గంపుల విజయ్ కుమార్ చేతుల మీదుగా కరపత్రాలు ఆవిష్కరించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతందన్నారు. ఏఎస్సై ఉల్లాస్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ నాయకులు భీంరావు, కరణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ మహిళా సీనియర్ కార్యకర్త మన్యం పద్మను శుక్రవారం ఎమ్మెల్యే కోవలక్ష్మి పరామర్శించారు. మన్యం పద్మ అనారోగ్యంతో ఇటీవల హైదరాబాద్‌లో చికిత్స పొంది ఇంటికి రావటంతో ఎమ్మెల్యే ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సౌందర్య, మాజీ జెడ్పీటీసీ ఆజ్మీర బాబురావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, అహల్యాదేవి పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్ష కేంద్రం తనిఖీ



పరిశీలిస్తున్న డీఐఈవో కళ్యాణి

ఆసిఫాబాద్‌రూరల్: రెబ్బెనలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు ప్రయోగ పరీక్షల కేంద్రాన్ని శుక్రవారం డీఐఈవో కళ్యాణి తనిఖీ చేశారు. జిల్లాలో ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు జనరల్ విభాగంలో 265 మంది విద్యార్థులకు 248 మంది హాజరు కాగా, ఒకేషనల్ విభాగంలో 11 మందికి 9 హాజరయ్యారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పరీక్షకు జనరల్ విభాగంలో 190 మంది 181 మంది, ఒకేషనల్ విభాగంలో 186 మందికి 182 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

లింగాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆసుపత్రిలో నులిపురుగుల నివారణపై అంగన్‌వాడీ, ఆశవర్కర్లకు వైద్యాధికారి మధుకర్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ఈనెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దత్తారాం, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ప్రకాశ్, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఇతరులకు సాయం చేసే గుణం కలిగి ఉండాలని కౌటాల ఎస్సై మధుకర్ అన్నారు. శ్రీసాయి అనాధ వృద్ధాశ్రమ వెల్ఫేర్ సొసైటీకి విరాళాలు అందించిన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. సంస్థ సభ్యులకు విరాళాలను అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చారి తిరుపతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.